క్లుప్తంగా

అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మలికిపురం: మండలంలోని కేశనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వనుము సోమశేఖరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్రం(ఫిజిక్స్), రసాయన శాస్త్రం(కెమిస్ట్రీ), తెలుగు సబ్జెక్టులు బోధించడానికి గాను అతిథి అధ్యాపకులను నియమించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. నెలకు రూ.10 వేలకు మించకుండా గౌరవభృతి ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు 13వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తులు కళాశాల ప్రిన్సిపాల్‌కు అందించాలన్నారు.

తాచుపాము హల్‌చల్



మాచవరంలో గోధుమ తాచును పట్టుకుంటున్న వర్మ

అంబాజీపేట: మండలంలోని మాచవరం కందుల మల్లేశ్వరస్వామి ఆలయం పక్కన ర్యాలి లక్ష్మీ సరోజ ఇంటిలో బుధవారం రాత్రి గోధుమ తాచు హల్‌చల్ చేసింది. ఇంటి యజమాని సరోజ, స్థానికులు భయాందోళనకు గురై స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం ఇచ్చారు. దాంతో వర్మ పామును చాకచక్యంగా పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించారు. అనంతరం జన సంచారం లేని ప్రాంతంలో వదిలిపెట్టారు.

అధ్యాపకులకు జీతాలు ఇవ్వాల్సిందే



అధ్యాపకులకు సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: మలికిపురం ఎంవీఎస్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు వెంటనే జీతాలు ఇవ్వాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. జీతాల కోసం ఆందోళన చేస్తున్న అధ్యాపకులకు ఆయన సంఘీభావం తెలిపారు. అధ్యాపకులు ఆందోళన చేస్తున్న శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థను అంధకారంలోకి నెట్టకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాటి శివకుమార్, కార్మిక సంఘాల నాయకులు చెవ్వాకుల సూర్యప్రకాశరావు, నేతల నాని తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వంటిపల్లి



వంటిపల్లి పాపారావు

ఆలమూరు: నియోజక వర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వంటిపల్లి పాపారావు, గౌరవ అధ్యక్షునిగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కార్యదర్శిగా సత్తి భామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా రాయుడు సుభాకర్, సయ్యపరాజు బంగారు రాజు, కోశాధికారిగా వెత్సా సూర్యకోటి ప్రకాష్‌రావు, సంయుక్త కార్యదర్శిగా ఉండమట్ల పరమేష్‌లను సహచర సభ్యులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తూరు సెంటర్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

పి.గన్నవరం: మండలంలోని జీఎంసీబీ కాలనీ, కాట్రగడ్డ, కందాలపాలెం, దిరిశాలవారిపేట ప్రాథమిక పాఠశాలల్లో 100 మంది విద్యార్థులకు గురువారం హైదరాబాద్‌కు చెందిన గుత్తుల మీరాకుమార్ ట్రస్టు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. సీనియర్ ఉపాధ్యాయుడు మహమ్మద్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో పిల్లి నాగ గోపాలకృష్ణ చేతుల మీదుగా దుప్పట్ల పంపిణీ జరిగింది. దుప్పట్లు పంపిణీ చేసిన ట్రస్టు సభ్యులను ఎంఈఓలు కోన హెలీనా, వీరభద్రానందంలు అభినందించారు.

ఘనంగా ప్రారంభమైన వార్షిక పవిత్రోత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో గురువారం స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులు పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో మొదటి రోజు అర్చకులు దీక్షాధారణ చేసి, మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విష్వక్సేన పూజ, పుణ్యహవచనం చేసి ఉత్సవాలకు అంకురార్పణ గావించారు. కార్యక్రమంలో చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



టేకిశెట్టిపాలెంలో పడవపై రాకపోకలు సాగిస్తున్న స్థానిక ప్రజలు



అప్పనపల్లిలో నీట మునిగిన ఇళ్లు



కె.ఏనుగుపల్లిలో నీట మునిగిన అంగన్‌వాడీ కేంద్రం



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వేపై ప్రయాణికులను దాటిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది



పి.గన్నవరం మండలంలో వరద ముంపు గ్రామాల్లో పర్యటించిన ఆర్డీఓ సత్యనారాయణ

ముంచెత్తిన గోదావరి వరద

- తీర గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- ముంపుబారిన పడిన లంక గ్రామాలు

మామిడికుదురు: గోదావరి వరద ఉప్పొంగడంతో తీర గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. మామిడికుదురు మండల పరిధిలోని ప్రధాన రహదారులను గురువారం వరద నీరు పూర్తిగా ముంచెత్తింది. దీంతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నం లంక గ్రామాలకు రోడ్డు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. మామిడికుదురు శివారు కొర్లగుంటలోని అప్పనపల్లి వారధి మీదుగా ట్రాక్టర్ల ద్వారా మూడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించారు. మూడు ట్రాక్టర్లను ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయడంతో వాటి ద్వారానే లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించారు. అప్పనపల్లి గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. బి.దొడ్డవరం ఇందిరమ్మ కాలనీతో పాటు పలు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. పెదపట్నంలంకలో లంకపేటకు వెళ్లే రహదారి ముంపు బారిన పడడంతో స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెదపట్నం రత్నాపురం, అరుంధతీపేట, పాశర్లపూడి బాడవ, పల్లవపాలెం,, పాశర్లపూడి లంక శ్రీరామ్‌పేట మత్స్యకార ప్రాంతాల వాసులు గోదావరి వరదతో తీవ్ర అవస్థలు పడ్డారు. శ్రీరామ్‌పేట వాసులు పడవలపై రాకపోకలు సాగించారు. లంక గ్రామాల్లోని పలు కూరగాయల తోటలతో పాటు అరటి తోటలను గోదావరి వరద ముంచెత్తింది. తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పశువుల పాకలు ముంపునకు గురికావడంతో వాటిని ఏటిగట్లపైకి తరలించారు. అమలాపురం ఆర్డీఓ కేశవ్‌వర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ మృత్యుం జయరావు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

రహదారులపై పడవ ప్రయాణం

పి.గన్నవరం: గోదావరి ఎగువ ప్రాంతాల్లో వరద కాస్త తగ్గుముఖం పట్టినా కోనసీమలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమి నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని లంక గ్రామాలు ఇంకా వరద నీటిలో నానుతున్నాయి. దీంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండలంలోని కె.ఏనుగుపల్లి, మానేపల్లి శివారు శివాయలంక, పల్లిపాలెం, జొన్నల్లంక రహదారులపై వరదనీరు పోటెత్తడంతో పడవలు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రహదారుల మీదుగా పడవలపై వెళ్తున్నారు. చాకలిపాలెం శివారులో ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా కనకాయలంక కాజ్‌వే వద్ద పడవలను ఏర్పాటు చేశారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే జి.పెదపూడి ఏటిగట్టు నుంచి బూరుగులంకకు వెళ్లే సీసీ రోడ్డు వరదనీట మునడంతో నడుంలోతు నీట్లో నడచి వెళ్తున్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న అయోధ్య లంక, పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనగర్లంక ప్రజలు పడవలపైనే వెళ్తున్నారు. వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో కొత్తపేట ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, పి.గన్నవరం తహసీల్దార్ శ్రీపల్లవి పర్యటించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ప్రజల రాకపోకల కోసం మొత్తం 10 ఇంజిన్ బోట్లు ఏర్పాటు చేసినట్టు శ్రీపల్లవి తెలిపారు.



అప్పనపల్లి గెద్దంవారిపేటలో ముంపునకు గురైన కాలనీ

జలమయమైన పల్లపు ప్రాంతాలు

సఖినేటిపల్లి: గోదావరి వరద కారణంగా సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక, సఖినేటిపల్లి లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో అధికారులు పడవలపై వెళ్లి వరద బాధితులకు ఆహారం, తాగునీరు అందించారు. ప్రజల రాకపోకలకు పడవలను ఏర్పాటు చేశారు. టేకిశెట్టిపాలెం నుంచి అప్పనరాముని లంక గ్రామానికి పడవలను ఏర్పాటు చేయడంతో వరద ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించారు.



బూరుగులంకలో గ్యాస్ సిలిండర్ మోసుకొస్తున్న వరద బాధితుడు

లంక ప్రజలకు తప్పని ఇక్కట్లు

అయినవిల్లి: నివాసాల్లోకి వరద నీరు చేరడంతో లంక గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, తొత్తరమూడి కె.పెదలంక, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లోని కాలనీలకు వరద నీరు చేరింది. ఎన్డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వే వద్ద లంక గ్రామాల ప్రజలను సురక్షితంగా వరద దాటిస్తున్నారు. వీరవల్లిపాలెంలో న్యూకాలనీ, పొట్టిలంక, కొండుకుదురు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు మునిగాయి. అరటి, కోకో, తమలపాకు, కాయగూర వంటి పంటలు వరదనీటిలో మునిగాయి. వీరవల్లిపాలెం, పొట్టిలంక గ్రామాల్లో రహదారి పైకి వరదనీరు చేరింది.

సెలక్షన్స్ పారదర్శకంగా నిర్వహించాలి



అంబాజీపేటలో స్పోర్ట్స్ డ్రెస్‌ను పీడీలకు అందజేస్తున్న ఎంఈఓలు



పాశర్లపూడిలంకలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థినులు

అంబాజీపేట: స్కూల్ గేమ్స్ సెలక్షన్లను పారదర్శకంగా నిర్వహించాలని ఎంఈఓ-1, 2 కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు అన్నారు. స్థానిక మండల రీసోర్స్ భవనంలో మండల స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి అందె సూర్యనారాయణ ఆధ్వర్యంలో మండల పీడీ, పీఈటీల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ 18, 19 తేదీల్లో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణం వద్ద అండర్ 14, 15 బాలురు, బాలికల స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ జరుగుతాయన్నారు. అనంతరం దాత అందజేసిన స్పోర్ట్స్ డ్రెస్‌ను పీడీ, పీఈటీలకు అందజేశారు.

ఉల్లాసంగా, ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ పోటీలు

మామిడికుదురు: పాశర్లపూడిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ గురువారం ప్రారంభమయ్యాయి. పోటీలను సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గురువారం జరిగిన కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో విద్యార్థినిలు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని తొమ్మిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మట్టా శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు ఎస్.దుర్గాప్రసాద్, ఎస్‌ఎంసీ చైర్మన్ చెరుకూరి సుబ్బారావు, బొరుసు గోపాలకృష్ణ, చెరుకూరి సత్తిబాబు, పాలమూరి పద్మ, గుడిమెళ్లంక కాశీ, పీడీ బళ్ల శ్రీనివాస్, వై.రవి, కె.శ్రీనివాసరావు, ఎల్.స్వాతి, ఎస్.శ్రీలక్ష్మి, పి.పాపన్న తదితరులు పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకలను నివారించాలి

అంబాజీపేట: రైతులంతా సామూహికంగా ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టాలని గుంటూరు వ్యవసాయ కమిషనర్ కార్యాలయ డీడీఏ డి.వెంకటేశ్వర్లు అన్నారు. ఇరుసుమండలో పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహన్‌రావు అధ్యక్షతన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందు ఒక శాతం, నూనె 2 శాతం, నూకలు 96 శాతం కలిపి ఎరగా తయారు చేసి బొరియల వద్ద పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయ్‌కుమార్, దుర్గారావు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని పంట పొలాల్లో ఎలుకల నిర్మూలనకు గురువారం బ్రోమోడయోలిన్ మందు పంపిణీ జరిగింది. మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.లక్ష్మీ లావణ్య ఆధ్వర్యంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగు చేస్తున్న సుమారు 11 వేల ఎకరాల్లో ఎలుకల నిర్మూలనకు 45 కేజీల మందును రైతులకు అందజేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లి, మట్టలదొడ్డి, కేతరాజుపల్లి, చెల్లిరేవు, వెదిరేశ్వరం, కోసూరి నగర్, గరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డోర్ మ్యాట్ల తయారీపై శిక్షణ

అయినవిల్లి: మండలంలోని ఎస్.పెదపాలెం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం కలవచర్ల వారి ఆధ్వర్యంలో కొబ్బరి తాడుతో డోర్ మ్యాట్ల తయారీపై 30 రోజులుగా ఇస్తున్న శిక్షణ గురువారంతో ముగిసింది. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు రూ.2 లక్షల విలువైన యంత్ర పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త వీఎస్‌జీఆర్ నాయుడు, గ్రామ సర్పంచ్ శీలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కర్బలా అమర వీరులకు కన్నీటి వీడ్కోలు

మామిడికుదురు: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా మామిడికుదురు ఇమామ్ అలీ రజా అస్థానాలో గురువారం గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. రజా పంజా నుంచి పీరు, గుమ్మటం తీసి ఊరేగిస్తూ మాతం జరిపారు. మామిడికుదురు, నగరం గ్రామాల్లోని అన్ని పంజాల్లో మాతం నిర్వహించి ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్‌తో పాటు కర్బలా అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. గురుహే తాజ్ దారే పురాత్ భక్త బృందం ఆధ్వర్యంలో నగరం పెద పంజీషా వరకు గుమ్మటాన్ని ఊరేగించారు. మత ప్రబోధకులు సయ్యద్ అబ్బాస్ బాఖరి మజ్లిస్ ఆలపించారు. అనంతరం భక్తులకు పలువురు ప్రసాదాలు వితరణ చేశారు.



నగరంలో గుమ్మటం ఊరేగింపు

అయినవిల్లి గణపతికి లక్ష గరిక పూజ

అయినవిల్లి: గణపతి నవరాత్రుల్లో భాగంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి వేద పండితుల ఆధ్వర్యంలో గురువారం లక్ష దూర్వార్చన పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామిని పంచామృతాభిషేకాలు, లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, పంచ హారతులు నిర్వహించారు. వేదమంత్రాలు, కేరళ డప్పు వాయిద్యాలతో స్వామిని మూషిక వాహనంపై ఉంచి వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. గణేషుని శరణుతో ఆలయం మారుమోగింది. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ మూర్తి, ఫెస్టివల్ ఆఫీసర్ వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ డీసీ కుమార్ పర్యవేక్షించారు. స్వామి సన్నిధిలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



అయినవిల్లి విఘ్నేశ్వరునికి దూర్వార్చన పూజలు చేస్తున్న అర్చకులు

18న డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికాస ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు గురువారం తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా తదితర విద్యార్హతలున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. జాబ్‌మేళాకు విచ్చేసే అభ్యర్థులు అర్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు తీసుకు రావాలన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి ఉచిత బస్సులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి నూతనంగా రెండు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం త్వరలో లొల్ల వంతెన నుంచి ఆలయానికి, అలాగే రావులపాలెం నుంచి ఆలయానికి ఉచిత బస్సు సర్వీసులు ప్రారంభించనున్నామన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓ కోరారు.



సిద్ధం చేస్తున్న ఉచిత బస్సు

ఉద్యోగావకాశాలపై విద్యార్థులకు అవగాహన

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిగ్రీ పూర్తయ్యాక ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉండే ఉద్యోగావకాశాలపై గురువారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన కళాశాల ప్లేస్‌మెంట్ సెల్, జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) సంయుక్త ఆధ్వర్యంలో యంగ్ ప్రొఫెషనల్ ట్రైనర్ సీహెచ్ రాజ్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా బ్యాంకింగ్, పోస్టల్, రైల్వే, పోలీస్ ఉద్యోగాలతో పాటు సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలపై వివరించారు. డిగ్రీ విద్యార్థులందరూ తప్పనిసరిగా ఉపాధి కార్యాలయ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ కె.సత్యనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.అంకమరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ రాజ్‌కుమార్

పౌష్టికాహార మాసోత్సవాలు

అయినవిల్లి: మండల పరిధిలోని ఎస్.మూలపాలెం సెక్టార్ పరిధిలో పౌష్టికాహార మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రామలక్ష్మి, విజయగౌరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సీడీపీఓ వెంకటేశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం శానపల్లిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రక్తహీనతపై సీడీపీఓ వెంకటేశ్వరి బాలికలకు అవగాహన కల్పించారు.

విద్యార్థులకు తాగు నీరందేలా చూస్తాం



తొండవరం స్కూల్‌లో వాటర్ ఫిల్టర్ వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ సరోవర్

అంబాజీపేట: స్వచ్ఛమైన తాగునీటిని విద్యార్థులకు అందేలా తగు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వి.సరోవర్ అన్నారు. 'దాహార్తితో విద్యార్థులు విలవిల' అనే శీర్షికన 'సాక్షి'లో ఈ నెల 11న వార్త ప్రచురితమైంది. దాంతో ఎంపీడీఓ తొండవరంలో జెడ్పీ హైస్కూల్‌లో నిరుపయోగంగా ఉన్న ప్యూరిఫై వాటర్ ఫిల్టర్‌ను పరిశీలించారు. దాని స్థితిగతులపై ఉపాధ్యాయులను ఆరాతీశారు. నందంపూడి వాటర్ ట్యాంకు నుంచి తాగు నీరు వచ్చేలా పైపులైన్‌ను ఏర్పాటు చేసి, ఆ నీటిని శుద్ధి చేస్తామన్నారు. నిరుపయోగంగా ఉన్న ప్యూరిఫై వాటర్ ఫిల్టర్‌కు మరమ్మతులు చేయించి, త్వరలో వినియోగంలోకి తీసుకువస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ వాకపల్లి దొరబాబు, పీఎంసీ చైర్మన్ పేరాబత్తుల వెంకటసుబ్బారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సాక్షి ఇంపాక్ట్

తుప్పలు, తీగలు తొలగించారు

అంబాజీపేట: ఇసుకపూడి శివారు సీతారామ్‌నగర్‌లో విద్యుత్ స్తంభానికి, ట్రాన్స్‌ఫార్మర్‌కు, విద్యుత్ వైర్లకు తీగలు అల్లుకుపోవడంపై ఈ నెల 9వ తేదీన సాక్షిలో ప్రచురితమైన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ జేఈ కె.మోహన్ ఆదేశాలతో గురువారం విద్యుత్ స్తంభానికి ఉన్న తుప్పలు, తీగలను తొలగించారు.



ఇసుకపూడిలో తుప్పలు, తీగలను తొలగించాక విద్యుత్ స్తంభం